ఎన్నికల విధులు సమర్థవంతంగా **నిర్వహించాలి**
అదనపు కలెక్టర్ రాజాగౌడ్ 8లో..

చలి మంట కాగుతూ **వృద్ధురాలి మృతి** 6లో..

హ్యూమన్‌రైట్స్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్



జగిత్యాల అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): ఆల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ జగిత్యాల అధ్యక్షుడిగా గాజుల శ్రీనివాస్‌ను నియమిస్తూ ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం సంవత్సర కాలం పాటు ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యార్థులకు భోజన సామగ్రి వితరణ

కోరుట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని కల్లూర్ రోడ్డులోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు డిస్ట్రిక్ గవర్నర్ సింహరాజు కోదండరాం సమక్షంలో మధ్యాహ్న భోజనం కోసం ప్లేట్లు, గ్లాసులను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు కొమ్ముల జీవన్‌రెడ్డి కుమారుడు కొమ్ముల నిఖిత్ రెడ్డి-అఖిత దంపతులు వివాహ దినోత్సవం పురస్క రించుకొని విద్యార్థులకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు గుంటుక చంద్ర ప్రకాష్, ఏలేటీ లక్ష్మారెడ్డి, నల్ల గంగాధర్, సురేష్ బాబు, అడెపు మధు, అల్లాడి ప్రవీణ్ కుమార్, స్వరాజు, పోతని ప్రవీణ్ కుమార్, అజయేందర్ రావు, కల్లెం గంగారెడ్డి, స్వరాజు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విజయానికి వ్యూహాలు

- జిల్లాలో ప్రధాన పార్టీల కసరత్తు
- తొలి, మలి విడత పంచాయతీల్లో ఊపందుకున్న ప్రచారం
- మూడో విడతకు నేటితో ముగియనున్న ఉపసంహరణ గడువు



జగిత్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికల వేడి మొదలైంది. అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రచారంలో ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు గెలుపే లక్ష్యంగా తమ మద్దతున్న అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 385 పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడత కోరుట్ల, వేములవాడ నియోజకవర్గాలోని 7 మండలాల్లో 122 పంచాయతీలు, 1,172 వార్డులు, రెండో విడత 144 పంచాయతీలు, 1,256 వార్డులు, మూడో విడత 119 పంచాయతీలు, 3,536 వార్డుల్లో పల్లెపోరు జరగనుంది.

మొదటి విడత నామినేషన్లు ముగిసి ప్రచారం చివరి దశకు చేరుకుంది. రెండో విడతలో ప్రచారం జోరందుకోవడంతో పల్లెలో ఎన్నికల కోలాహలం మొదలైంది. మూడో విడత నామినేషన్ల పరిశీలన, చెల్లుబాటు అయిన నామినేషన్లు, అప్పీల్ స్వీకరణ, అప్పీల పరిష్కారం పూర్తయింది. నామినేషన్ల ఉపసంహరణ మిగిలి ఉంది. ఆయా పార్టీల పెద్దలు తమ మద్దతుదారుల విజయానికి కసరత్తు చేస్తున్నారు. కుల, యువ, మహిళా సంఘాల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. స్థానిక నాయకులతో సమావేశాలు నిర్వహించి ఇంటింటి ప్రచారం చేస్తున్నారు.

రెబల్స్‌కు బుజ్జగింపు..

మూడో పంచాయతీ ఎన్నికలకు జోరుగా నామినేషన్లు వేశారు. కొన్ని పంచాయతీల్లో ప్రధాన పార్టీల నుంచి ఒకరి కంటే ఎక్కువ మంది నామినేషన్లు వేయడంతో ప్రధాన పార్టీల నేతలకు సవాల్‌గా మారింది. విభేదాలను పక్కన పెట్టి పార్టీ నుంచి ఒకరే బరిలో ఉండేలా బుజ్జగిస్తున్నారు. ఈనెల 9వ తేదీ వరకు నామినేషన్ల విత్‌డ్రాకు సమయం ఉండగా రెండు రోజులుగా చర్చల పర్వం మొదలైంది. రెబల్స్‌కు నచ్చజెప్పే బాధ్యతను ప్రధాన పార్టీలు మండల నాయకులకు అప్పగించాయి. అవసరమైతే నియోజకవర్గానికి చెందిన ప్రధాన ప్రజాప్రతినిధులు కీలక నేతలు రంగంలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎవరు పోటీలో నిలవాలి, ఎవరు విత్‌డ్రా చేసుకోవాలో దిశా నిర్దేశం చేయనున్నారు.

సత్తా చాటేందుకు కాంగ్రెస్ సిద్ధం..

అధికారం కాంగ్రెస్ సత్తా చాటేందుకు పంచాయతీ ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. బీసీల 42శాతం రిజర్వేషన్ నేపథ్యంలో జనరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను బరిలో నిలిపేందుకు ప్రయత్నిస్తున్నారు. తమ నియోజకవర్గాల పరిధిలో మెజార్టీ స్థానాల్లో గెలవడానికి వ్యూహాలు రచిస్తున్నారు. ధర్మపురి నియోజకవర్గంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కోరుట్ల నియోజకవర్గంలో పంచాయతీల్లో పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, వేములవాడ నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జగిత్యాల నియోజకవర్గంలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అభ్యర్థులకు దిశా నిర్దేశం చేస్తున్నారు. అభివృద్ధి కోసం ప్రభుత్వంతో కలిసి పనిచేస్తానని ప్రకటించిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ తనదైన రాజకీయం నడుపుతున్నారు. అవసరమైన ప్రచార వ్యూహాలు, మద్దతుదారుల సర్దుబాటు గ్రామస్థాయి నాయకుల సమన్వయం వంటి అంశాలపై సూచనలు చేస్తున్నారు.

ఉనికి కోసం బీఆర్ఎస్..

గత అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గంలో మినహా మిగిలిన నియోజకవర్గాల్లో ఓటమి ఎదుర్కొన్న బీఆర్ఎస్ ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లో ఉనికిని చాటేందుకు యత్నిస్తోంది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌లు గ్రామస్థాయి నాయకులతో సమావేశాలు నిర్వహించారు. గ్రామాల్లో రాజకీయ స్థితిగతులపై ఆరా తీస్తూ అభ్యర్థులను గెలిపించే పనిలో నిమగ్నమయ్యారు. పార్టీ పటిష్టతను తిరిగి చాటుకునేందుకు ఎక్కువ స్థానాల్లో విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. తొలి విడత

మిగతా 8వ పేజీలో..

అభ్యసన నైపుణ్యాలను పెంపొందించాలి
-డీఈవో రాము



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రాము

రాయికల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసనా నైపుణ్యాలను పెంపొందించాలని డీఈవో రాము సూచించారు. రాయికల్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాలను డీఈవో సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన నైపుణ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని అమలుపరుస్తున్న ఉపాధ్యాయులను ప్రశంసించారు. పిల్లలను కనీస భాషా నైపుణ్యాలు, గణిత సామర్థ్యాలు పెంపొందించడానికి దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం మండలోజు రవీందర్, ఉపాధ్యాయులు షరై శ్రీనివాస్, వేల్పుల గంగరాజం, మచ్చ స్వరూప, సీఆర్‌పీ రవీందర్ పాల్గొన్నారు.

ఉద్యోగుల ఓటు గోప్యత అవసరం
-తపస్ జిల్లా అధ్యక్షుడు దేవయ్య



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న తపస్ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు సాధారణ పౌరుడివలె ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా శాఖ బాధ్యులు జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిం చారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగస్తులకు ముందుగా సంబంధిత డిస్ట్రిబ్యూటర్ సెంటర్ వద్ద స్వస్తిక్ గుర్తు ఆధారంగా తమ యొక్క ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అవకాశం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల ఓటు గోప్యతను పాటించి ఉద్యోగ, ఉపాధ్యాయులు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భోనగిరి దేవయ్య, బోయినిపెల్లి ప్రసాద్‌రావుతో పాటు సారంగాపూర్, జగిత్యాల మండల అధ్యక్షులు శ్రీనివాసరావు, కట్ట రామకృష్ణ తదితరులున్నారు.

క్షయ బాధితుల వివరాలు నమోదు చేయాలి
-జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

కొడిమ్యాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): క్షయ బాధితుల వివరాలను నిక్షయ్ పోర్టల్‌లో నమోదు చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి ఎన్. శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నాన్ కమ్యూనికేబుల్ డీసీజ్ ప్రోగ్రాం, క్షయవ్యాధి ప్రోగ్రాం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న పేషెంట్లను గుర్తించి పరీక్షలు చేయించాలన్నారు. బీపీ, షుగర్, క్యాన్సర్ పేషెంటలను స్క్రీన్ చేయాలన్నారు. మొదటి త్రైమాసిక గర్భిణులకు సికిల్ సెల్ అనీమియా వ్యాధి, తలసేమియా పరీక్షలు చేయించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మండల వైద్యాధికారులు సీహెచ్ నరేష్, పరమేశ్వరీ, కమ్యూనిటీ హెల్త ఆఫీసర్ రాజశేఖర్, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం. శ్రీనివాస్, వెంకటనర్సమ్మ, అలివేలు, ఏ.ఎన్.ఎంలు సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి
-జిల్లా పరిశీలకుడు రమేశ్



మాట్లాడుతున్న జిల్లా పరిశీలకుడు రమేశ్

మల్యాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించాలని జిల్లా అబ్జర్వర్ రమేశ్ సూచించారు. మల్యాలలో సోమ వారం ఎన్నికల నిర్వహణ, వ్యయంపై అభ్యర్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనల మేరకు వ్యయం, నిర్వహన చూసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు మనోహర్, ఎంపీడీవో స్వాతి, ఎస్సై నరేశ్, రిటర్నింగ్ అధికారులు, తదితరులు ఉన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
జిల్లా ఇంటర్ విద్యాధికారి నారాయణ



సమావేశం నిర్వహిస్తున్న జిల్లా ఇంటర్ విద్యాధికారి నారాయణ

జగిత్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి బొప్పరాతి నారాయణ అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకులు, విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఇంటర్ వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలను తీసుకొచ్చేం దుకు చేపట్టవలసిన చర్యలను గురించి అధ్యాపకులకు సూచనలు అందించారు. దానిలో భాగంగా సైన్స్ విద్యార్థుల ప్రాక్టికల్స్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఒకేషనల్ విద్యార్థులకు సంబంధించిన రికార్డులను నిర్వహించవలసిందిగా సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కంకణాల శ్రీనివాస్, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న స్వామి జాతర



మల్లన్న స్వామిని దర్శనం చేసుకుంటున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని వర్షకొండ గ్రామంలో మల్లన్న జాతర మహోత్సవం అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో సాగుతున్నది. ఈ మేరకు సోమవారం మల్లన్న స్వామి జాతరలో భాగంగా ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పాల్గొని దర్శనం చేసుకున్నారు. గ్రామమంతా పండుగ వాతావరణం తలపిస్తున్నదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. భక్తులను, గ్రామస్థులను ఆత్మీయంగా పలకరిస్తూ, జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక అభివృద్ధి, ఆలయ పరిసరాల సౌకర్యాల మెరుగుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని భక్తులకు హామీ ఇచ్చారు.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
కలెక్టర్ సత్యప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

కొడిమ్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల విధు లను ప్రిసైడింగ్ అధికారులు సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు.

సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రీ సైడింగ్ అధికారులకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఎన్ని కల నిర్వహణపై తీసుకోవాలిసిన పలు అంశాలపై అవగాహన కలిపించారు. గ్రామ పంచాయతీ ఎన్నికల విధులు చాలా కీలకమైనవని ప్రతి అంశంపై పూర్తి స్థాయిలో అవగాహన కలిపించుకొని విధులను నిర్వహించాలన్నారు. ఎన్నికల ముందు రోజు ఎన్నికల సామగ్రి సమకూర్చుకోవటం, పూర్తి సామగ్రి ఉందా లేదా, బ్యాలెట్ బాక్స్ ఎలా సీల్ చేయాలి, చాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, బ్యాలెట్ పేపర్స్ ఇవ్వటం, పీవో డైరీ నింపటంపై అవగాహన కల్పించారు. ఏజెంట్ సిగ్నేచర్ ఎక్కడ తీసుకోవాలి, పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్ బాక్స్ సీలింగ్, ఓట్ల లెక్కింపు, ఉప సర్పంచు ఎన్నిక, సర్పం చ్, ఉప సర్పంచ్ నియామక పత్రాల ఇవ్వడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు వారికి ఏర్పాటు చేసిన చోటే బస చేయాలన్నారు. అందుబాటులో ఉన్న బంధువుల, అభ్యర్థుల ఇంటికి వెళ్లరాదన్నారు. పోలింగ్ ముందు రోజు నుంచి కౌంటింగ్ వరకు ప్రీసైడింగ్ అధికారుల కార్యాచరణ, విధులు, బాధ్యతలు, తీసుకోవాలిసిన జాగ్రత్తలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాస్టర్ ట్రేనర్లు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. కిరణ్ కుమార్, ఎంపీడీవో ఇ. స్వరూప ఇతర అధికారులు పాల్గొన్నారు.

యాదవ చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అంజయ్య యాదవ్



పెగడపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : యాదవ చైతన్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పెగడపల్లి మండలం అయిత్‌పల్లి గ్రామానికి చెందిన పలుమారు అంజయ్య యాదవ్‌ను నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొర్ల అయిలేష్ యాదవ్ సోమవారం నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు అంజయ్య యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో యాదవ చైతన్య వేదికను బలోపేతం యాదవుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తానన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

జగిత్యాలరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన జక్కుల వెంకట్ తల్లి అనారోగ్యంతో మృతిచెందగా సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ బాధిత కుటుంబాన్ని అంతర్గాంలోని వారి ఇంటి వద్ద పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డే సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఆరుగురు ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ అనంతరం ఫోన్‌లో సంబంధిత అధికారులతో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషిచేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా బాధితులకు న్యాయం జరిగేలా చూస్తున్నామని పేర్కొన్నారు.

పోలింగ్ సజావుగా సాగేలా చూడాలి
జడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి



ఉద్యోగులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో

రాయికల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా సాగేలా చూడాలని జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని జడ్పీ సీఈవో పరిశీలించారు. ఎన్నికల నిబంధనలను పక్కాగా పాటిస్తూ పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. సకాలంలో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు అధికారులు చేరుకోవాలని సూచించారు. చెక్ లిస్టుకు అనుగుణంగా బ్యాలెట్ ప్రాలు, ఇతర సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. సీటింగ్ అరెంజ్‌మెంట్, సీక్రెట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్ వంటి నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ఆటంకాలు కలుగకుండా సి బ్బంది విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రిని పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చి ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించి తిరిగి వాటిని స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చడం వరకు ప్రిసైడింగ్ అధికారుల బాధ్యత అని, వీరికి సహాయ ప్రిసైడింగ్ అధికారులు అవసరమైన చోట సహాయం అందిస్తారని, పోలింగ్ స్టేషన్‌లో జరిగే అన్ని కార్యక్రమాలు వీరి పర్యవేక్షణలోనే జరుగుతాయన్నారు. వారి వెంట డిప్యూటీ డీఈవో నరేష్, డీఈవో రాము, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా, ట్రైనర్లు పాల్గొన్నారు.

●మల్లాపూర్, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి సూచించారు. సోమవారం మల్లాపూర్ మండలం కేంద్రంలో ఆర్‌వోలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలంటే మనకు నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల్లో ప్రతి చిన్న అంశాన్ని, అనుమానాలను శిక్షణలో పూర్తి స్థాయిలో విచారించి తెలుసుకోవాలని సూచించారు. ట్రైనింగ్ హాల్ నుంచి పూర్తి అవగాహనతో బయటకు వెళ్లాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ చేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈవో నరేష్, ఎంపీడీవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

రోళ్లవాగు ప్రాజెక్టుకు షెటర్ బిగించాలి

బీర్‌పూర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రోళ్ళవాగు ప్రాజెక్టుకు షెటర్ బిగించి నీటిని నిలువ చేసే ఏర్పాట్లు చేయాలని సోమవారం ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి జీవన్‌రెడ్డి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు తూముకు షట్టర్ బిగించి నీరు నిలువ ఉండేలా చూడాలని పలు మారులు ఇరిగేషన్ అధికారులకు చెప్పామన్నారు. నవంబరులో కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్తే నవంబరు 30 వరకు షట్టరు బిగించి రైతులకు నీటి సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇంతవరకు షట్టర్ ఏర్పాటు చేయకపోవడం బాధకరమన్నారు. అధికారులు స్పందించి డిసెంబరు చివరి వరకైనా షట్టర్ బిగించి నీరు నిలువ చేసి రైతులకు సాగు నీరు అందేలా చూడాలని ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కోరారు.

బ్యాలెట్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం పరిశీలన



డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాడల్ స్కూల్‌లో ఏర్పాటు చేయనున్న ఆయా పోలింగ్ కేంద్రాలకు సరఫరా చేయనున్న రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పలువురు అధికారులు సోమవారం పరిశీలించారు. ఈ నెల 25న గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణ, బ్యాలెట్ ఏర్పాట్లు, వాటి తరలింపు అంశాలతోపాటు కేంద్రంలో నిర్వహణ విధి విధానాలను చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీఓ శ్రీనివాస్, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీఓ గణేష్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల నిబంధనలపై అవగాహన

బీర్‌పూర్,(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలంలోని గ్రామాలలో సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఆదివారం ఎన్నికల నియమ నిబంధనలపై రైతువేదికలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల వ్యయం, మోడల్ కోడ్ అఫ్ కండక్ట్‌లపై అభ్యర్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్నికల కర్చుల అధికారి మనోహర్, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో భీమేష్, ఎంపీవో మధుసుదన్, రిటర్నింగ్ అధికారులు, ఎఫ్ఎస్టీ ఆర్ఐ శ్రీనివాస్ బృందం, ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ మృతి


దేవేందర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎర్రోజు దేవేందర్(53) సోమవారం మధ్యాహ్నం గుండె పోటుతో మృతిచెందారు. దేవేందర్ సోమవారం మధ్యాహ్నం 12గంటల వరకు కరీంనగర్‌లోని గాంధీ చౌరస్తాలో ట్రాఫిక్‌విధులు నిర్వహించారు. విధులు ముగించుకొని ఇంటికిచేరుకున్న వెంటనే ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. 1992లో ఏఆర్ కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరిన దేవేందర్, ఆ తర్వాత సివిల్ పోలీసు కానిస్టేబుల్‌గా కన్వర్షన్ పొంది, ప్రస్తుతం హెడ్‌కానిస్టేబుల్‌గా కరీంనగర్ ట్రాఫిక్‌స్టేషన్‌లో సేవలు అందిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. హెడ్ కానిస్టేబుల్ దేవేందర్ మృతిపై సానుభూతిని తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ, సీఐలు, ఎస్సైలు పోలీసు ఉన్నతాధికారులు దేవేందర్ కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

అనారోగ్య సమస్యలతో వృద్ధురాలి ఆత్మహత్య


జీల మల్లవ్వ(ఫైల్)

గన్నేరువరం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం మండల కేంద్రానికిచెందిన జీల మల్లవ్వ(85) అనారోగ్య సమస్యలతో బాధపడుతూ సోమవారం గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన జీల మల్లవ్వ కొద్దిరోజులుగా అనారోగ్యసమస్యలతో బాధపడుతోంది. ఆవేదనకు గురయ్యేది. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో గడ్డిమందు తాగింది. వ్యవసాయ పనులకు వెళ్లిన కొడుకు ఇంటికి వచ్చేసరికి అపస్మారకస్థితిలో ఉండడాన్ని చూసి అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. అప్పటికే వృద్ధురాలు మృతిచెందింది. కొడుకు జీల ఎల్లయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. వృద్ధురాలికి భర్త, కొడుకు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వీణవంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందుతాగి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన బేతోజు అంజనేయులు(27) మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. నవంబరు 30న అంజనేయులు మద్యం తాగి ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రులు మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్లి గడ్డి మందు తాగాడు. తిరిగి వచ్చి తాను గడ్డి మందు తాగినట్లు చెప్పాడు. వెంటనే 108లో కరీంనగర్ ఆస్పత్రికి, పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. అంజేయులు తల్లి విజయ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

చలి మంట కాగుతూ నిప్పంటుకొని వృద్ధురాలు మృతి

మల్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లి గ్రామంలో సోమవారం చలిమంట కాగుతూ తొంట మల్లవ్వ(85) అనే వృద్ధురాలు మృతిచెందింది. మల్లవ్వ సోమవారం ఉదయం స్నానం చేయడానికి ఇంటివద్ద పొయ్యిమీద నీల్లు వేడి చేసుకుంటూ అక్కడే చలిమంట కాగుతోంది. ప్రమాదవశాత్తు చీరకు మంటలు అంటుకొని మల్లవ్వకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స కోసం మల్లవ్వను జగిత్యాలలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

దాడికి పాల్పడిన మహిళపై కేసు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలంలోకి అక్రమంగా ప్రవేశించడంతో పాటు దాడిచేసిన సంఘటనలో వీర్నపల్లి మండలకేంద్రానికి చెందిన మహిళ మునిగే భాగ్యపై కేసు నమోదు చేశామని ఎస్ఐ లక్ష్మణ్ సోమవారం తెలిపారు. గ్రామంలోని యాస యాకుబ్‌కుచెందిన పొలంలోకి భాగ్య ప్రవేశించిందని పేర్కొన్నారు. ఇదేమిటని ప్రశ్నించిన యాకుబ్‌ను అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడి చేసిందని చెప్పారు. బాధితుడు యాకుబ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

మానకొండూర్‌లో 180 మంది బైండోవర్

మానకొండూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పాత నేరస్తులు, గత ఎన్నికలలో గొడవలకు పాల్పడ్డ 180 మందిని బైండోవర్ చేసినట్లు సీఐ సంజీవ్ తెలిపారు. బైండోవర్ చేసిన ఆరునెలలలోపు మళ్లీ గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

జేబులు గుళ్ల



- వేములవాడలో జోరుగా మూడు బిళ్లల ఆట
- భక్తుల రద్దీ ప్రాంతాలే అడ్డాలు
- పట్టించుకోని అధికారులు

వేములవాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం పరిసరప్రాంతాల్లో మూడు బిళ్లల ఆట జోరుగా సాగుతోంది. రాజన్నను దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని సంతోషంగా తిరిగి వెళ్లాల్సిన కొందరు భక్తులు జేబులు ఖాళీ చేసుకుని వెళ్తున్నారు. వేములవాడకు వచ్చే భక్తుల వద్ద మూడు బిళ్లల ఆటతో దొరికినకాడికి దండుకుంటున్నారు. నిత్యం వేల సంఖ్యలో భక్తులు పట్టణానికి రావడం నిర్వాహకులకు వరంగా మారింది. అమాయక భక్తులకు గాలం వేసి మోసానికి పాల్పడుతున్నారు. పట్టణంలో భక్తులు రద్దీగా ఉండే ప్రాంతాలను అడ్డాలుగా మలుచుకుని దందా సాగిస్తున్నారు. జాతర గ్రౌండ్ ఏరియాలో సినిమా థియేటర్ సమీపంలో, గోశాల కట్ట వద్ద, రాజన్న ఆలయ సమీపంలో మూడు ప్రాంతాల్లో భక్తులను నిలువుదోపిడీ చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో వారి ఇష్టారాజ్యంగా మారింది.


గోశాల సమీపంలో కట్టకింద మూడుబిళ్లలాట

● అమాయకపు భక్తులకు గాలం

వేములవాడ పట్టణంలో రద్దీ ప్రాంతాలను గుర్తించి మూడు బిళ్లల ఆటను ఆడేందుకు ముందస్తుగా ప్రణాళిక రూపొందించుకుంటారు. ఒక్కో చోట ముగ్గురు నుంచి నలుగురు వరకు తమ వ్యక్తులను ఆట ఆడేందుకు ముందుగానే సామాన్య భక్తుల మాదిరి ఆటవద్ద నిలుచుంటారు. భక్తుల దృష్టిని తమవైపు మళ్లించే విధంగా చేస్తారు. రూ. 100 నుంచి ఆట ప్రారంభం అవుతుంది. రూ. 100 పెడితే గెలిస్తే రూ. 200 ఇస్తారు. రూ. 500లకు రూ. 1000 ఇస్తామని నమ్మించి భక్తులను మోసానికి గురిచేస్తారు. మూడు బిళ్లల్లో ఒక బిల్లకు కింది వైపు కలరు వుంటుంది. కలర్ ఉన్న బిళ్లను గుర్తించి ఎంత డబ్బులు పెడితే పెట్టిన వాటికి డబుల్ డబ్బులు ఇస్తామని మభ్యపెడతారు. మూడు బిళ్లలపై భక్తులు, ప్రజలు డబ్బులు పెడితే ఒక బిళ్లపై పెట్టిన వారికి మాత్రమే డబ్బులు వస్తాయి. మిగతా రెండు బిళ్లలపై పెట్టిన డబ్బులు మాత్రం నిర్వాహకులు తీసుకుంటారు. ఇలాంటి మోసం పట్టణంలో కొంత కాలంగా నడుస్తున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం దృష్టి సారించి ప్రజలు మోసానికి గురికాకుండా చూడాలని కోరుతున్నారు.

నగదు, మద్యం పట్టివేత


పట్టుబడిన నగదును చూపుతున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన తనిఖీలో పోలీసులు సోమవారం నగదు, మద్యాన్ని పట్టుకున్నారు. సీఐ నిరంజన్‌రెడ్డి వివరాల ప్రకారం.. మాడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో భాగంగా నగునూర్ నుంచి జూబ్లీనగర్‌వైపు వాహనాల తనిఖీ చేపట్టారు. కొత్తపల్లిమండలం రేకుర్తికి చెందిన వేముల శ్రీకాంత్ వద్ద లక్షరూపాయలను గుర్తించారు. నగదుకు సంబంధించి ఆధారాలు చూపించకపోవడంతో ఎన్నికలరిటర్నింగ్ అధికారి, తహసీల్దార్‌కు స్వాధీనం చేశారు.

● కరీంనగర్ రూరల్ మండలంలోని జూబ్లీనగర్, నగునూర్, దుర్శేడ్, చెర్లబూత్కూర్‌లో సోమవారం పెట్రోలింగ్ చేస్తుండగా మద్యం పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ముద్దసాని సూర్యచందర్, మల్లేని సింహాద్రి, బుద్ధం రమేష్, జంగంపల్లి రవిని తనిఖీ చేయగా వారి వద్ద సుమారు 32 లీటర్ల విస్కీ, బీరు బాటిళ్లు లభించినట్లు పేర్కొన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

రుద్రంగిలో మద్యం పట్టివేత

రుద్రంగి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు ఫ్లయింగ్ స్క్వాడ్ మనోహర్ తెలిపారు. రుద్రంగి గ్రామానికిచెందన ఓవ్యక్తి బైక్‌పై రూ.4వేలవిలువగల మద్యం తరలిస్తుడటంతో రుద్రంగిలోని ప్రధాన రహదారిలో పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధికారులు, పోలీసులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

పెద్దపల్లిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ కుమ్మరి శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఇష్టా రాజ్యంగా వాహనాలు నడిపి ఇతరుల ప్రాణాలకు హానీ కలిగించవద్దన్నారు. మద్యం సేవించి వాహనం నడపవద్దని, పట్టుపడితే జరిమానాతో పాటు లైసన్స్ రద్దు చేసి జైలు శిక్ష పడేలా చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు. నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్ చేశారు. ట్రాఫిక్ సీఐలు అనీల్ కుమార్, రాజేశ్వర్‌రావు, సత్యనారాయణ తో 30 మంది సిబ్బంది పాల్గొన్నారు.

సైనికుడికి సన్మానం


సైనికుడిని సన్మానిస్తున్న యువకులు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామానికి చెందిన యువకుడు బద్దిపడిగె వినయ్ అగ్నివీర్‌గా ఎంపికై మద్రాస్ రెజిమెంట్ సెంటర్‌లో శిక్షణ పూర్తి చేసుకుని స్వగ్రామానికి చేరుకున్నారు. ఆయనను స్థానిక యువకులు, గ్రామస్థులు సోమవారం ఘనంగా సన్మానించారు. యువకులు వినయ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు.

రూ.2కోట్లకు ఐపీ పెట్టిన వ్యాపారి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): సిరిసిల్ల పట్టణంలో ఓ వ్యాపారి తాజాగా రూ.2కోట్లకు ఐపీ పెట్టడంతో అప్పులు ఇచ్చిన వారితోపాటు సామగ్రి ఇచ్చిన వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని ప్రగతినగర్, శివనగర్ ప్రాంతాల్లో మూడుసంవత్సరాల క్రితం పట్టణానికి చెందిన వ్యాపారి రూ.2 కోట్లతో సూపర్ మార్కెట్‌తోపాటు రైస్ డిపోను ఏర్పాటుచేశారు. అయితే సూపర్ మార్కె ట్‌తోపాటు రైస్‌డిపోలలో నష్టం వాటిల్లడంతో సదురు వ్యాపారి రెండు నెలల నుంచి మార్కెట్‌ను మూసివేశాడు. అప్పులు ఇచ్చిన వారితోపాటు సామగ్రి ఇచ్చిన వ్యాపారులు వారి కుటుంబీకుల వద్దకు వెళ్లగా పదిరోజుల్లో అప్పులు చెల్లించి తిరిగి సూపర్ మార్కెట్‌ను తెరుస్తామని నమ్మించినట్లు తెలిసింది. పది రోజుల గడవక ముందే సదురు వ్యాపారి వ్యాపారంలో నష్టపోయా అప్పులు చెల్లించేస్థితి లేదంటూ అప్పులు ఇచ్చిన వారితోపాటు వ్యాపారులకు సోమవారం ఐపీలు పంపించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతుండడం సంచలనం రేపుతుంది.

జీతాలు పెంచి డ్రైవర్లను ఆదుకోండి


కార్మికులతో మాట్లాడుతున్న కౌశిక్ హరి

పాలకుర్తి,అంతర్గాం డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుందనపల్లి హెచ్‌పి ఇంధన డిపోలో ట్యాంకర్ డ్రైవర్,క్లీనర్స్ జీతాలు పెంచి వారిని ఆదుకోవాలని సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశిక్ హరి అన్నారు.గతంలో వారు తమ సమస్యలను పరిష్కరించాలని హరిని సంప్రదించడంతో ట్యాంకర్ యజమానులతో చర్చించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. లేనియెడల ట్యాంకర్ డ్రైవర్లు, క్లీనర్లు తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటూ వారి హక్కుల సాధనకు తమవంతు సహకారం ఉంటుందన్నారు. ఈ చర్చల్లో మద్దికుంట శంకర్,నిమ్మరాజుల రవి,నెరవట్ల సతీష్ ఎండీ ఇన్నూస్‌తోపాటు పలువురు డ్రైవర్లు,క్లీనర్లు ఉన్నారు.

కిరాణా సామాను పట్టివేత

వేములవాడ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ అర్బన్ మండలం రుద్రవరంలో హరీష్ అనే వ్యక్తి ఓటర్లకు పంచడానికి సిద్ధంగా ఉంచిన కిరాణా సామాను ప్యాకెట్లను ఎఫ్ఎస్‌టీ అధికారి సురేష్ పట్టుకొని వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. 13ప్యాకెట్ల కిరాణ సామాను విలువ సుమారు రూ.30 వేలు ఉంటుందని తెలిపారు.

ఇసుక లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

వీణవంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇసుక లారీలతో తమకు ఇబ్బంది కలుగుతోందని వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామస్థులు సోమవారం వాటిని అడ్డుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం వందలాది లారీలు గ్రామం నుంచి వెళ్తున్నాయని, రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నదని మండిపడ్డారు. దుమ్మూధూళితో అవస్థలు పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు పక్కన ఉన్న నివాసాల్లోకి దూమ్ము చేరుతోందని, అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని, నీళ్లుచల్లించాలని డిమాండ్‌చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.


రెడ్డిపల్లిలో లారీలను అడ్డుకున్న గ్రామస్థులు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామశివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కోనరావుపేట మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ఎల్లయ్య తన బైక్‌పై దుమాల బైపాస్ నుంచి స్వగ్రామానికి వెళుతున్నాడు. అదే సమయంలో అక్కపల్లి గ్రామానికి చెందిన మహేశ్ తన పికప్ వాహనంలో కూలీలను ఎక్కించుకుని దుమాల వైపునకు వెళ్తుండగా రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎల్లయ్యను సిరిసిల్లలోని ఆసుపత్రికి అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ

జమ్మికుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని హౌసింగ్‌బోర్డుకాలనీలో తాళంవేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కాలనీకిచెందిన దామెరసుధాకర్ కుటుంబ సభ్యులు మూడురోజుల క్రితం తిరుపతికి వెళ్లారు. ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించిన స్థానికులు యజమానికి సమాచారం అందించారు. సోమవారం ఉదయం ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు మూడు తులాల బంగారం, రూ.30వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రామకృష్ణగౌడ్ తెలిపారు.

పండ్ల తోటల సాగుతో అధిక ఆదాయం


బొప్పాయి తోట


జామ కాయలను తెంపుతున్న రైతు తిరుపతిరెడ్డి

గొల్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం శ్రీరాములపల్లి గ్రామంలో ఎనిమిది ఎకరాల్లో పండ్లతోట సాగు చేస్తూ ఓ రైతు అధిక ఆదాయం పొందుతున్నాడు. తిరుపతిరెడ్డి అనే రైతు తనకున్న వ్యవసాయ భూమిలో జామ, బొప్పాయి, మామిడి, కర్బూజ వంటి పండ్ల తోటల పెంపకంతోపాటు పందిరి బీర, కాకర వంటి కూరగాయల సాగు చేస్తున్నాడు. దీంతో ఏటా రూ.8లక్షల మేర ఆదాయాన్ని ఆర్జిస్తున్నాడు. తిరుపతి రెడ్డి తన భార్య, తల్లి సహకారంతో పండ్ల తోటలను సాగు చేస్తున్నాడు. పండించిన పండ్ల తోటలవద్ద రోడ్ల పక్కనే విక్రయిస్తున్నాడు. సీజనల్ పండ్ల సాగుకు అధికప్రాధాన్యం ఇస్తున్నాడు. ప్రస్తుతం జామ, బొప్పాయి పండ్లను సాగు చేస్తున్నాడు. వేసవిలో కర్బూజను సాగు చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని పండ్ల వ్యాపారులు, ఇతర చిరు వ్యాపారులు వీరి దగ్గర కొనుగోలు చేసి బహిరంగ మార్కెట్లో విక్రయిస్తుంటారు. తిరుపతిరెడ్డి ఆరు సంవత్సరాలుగా పండ్ల తోటలను సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు.

● పండ్ల తోటల పెంపకం లాభదాయకం..

- తిరుపతిరెడ్డి, రైతు, శ్రీరాములపల్లి



సంప్రదాయ పంటల సాగు కంటే పండ్ల తోటల పెంపకం వల్ల అధిక లాభాలు గడించవచ్చు. ఆరుసంవత్సరాలుగా జామ,బొప్పాయి, మామిడి, కర్బూజ వంటి పండ్ల తోటల సాగు చేస్తున్నా. నా తల్లి, భార్య సహకారం ఎంతో ఉంది. వినియోగదారులకు తక్కువ ధరకు నాణ్యమైన తాజా పండ్లను విక్రయిస్తుంటాం.

రాష్ట్రంలో రూ.3వేల కోట్ల పెట్టుబడి

● గ్లోబల్ సమ్మిట్లో ప్రభుత్వంతో ఎంవోయూ ● పెద్దపల్లి జిల్లాలో గ్రీన్ ఎనర్జీ పరిశ్రమ


ఒప్పందం కుదుర్చుకున్న పత్రాలతో సురభి గ్రూపు ప్రతినిధులు

పెద్దపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఎనర్జీ సెక్టార్‌లో పెట్టుబడి పెట్టేం దుకు సురభి గ్రూప్స్ ముందుకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌లో సురభి గ్రూప్ ఎస్ఎల్ఆర్ పవర్ చైర్మన్ సురభి హరేందర్‌రావు రాష్ట్రంలో 3వేలకోట్ల పెట్టుబడితో పెద్దపల్లి జిల్లాలో పరిశ్రమ స్థాపనకు ప్రభుత్వంతో ఎంఒయు కుదుర్చుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి మల్లు విక్రమార్కకు ఎంవోయు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సురభి గ్రూప్స్ గ్రీన్ ఎనర్జీ సెక్టార్లో భాగంగా పెద్దపల్లి జిల్లా సుగ్లాం పల్లిలో 3వేల కోట్ల రూపాయల పెట్టుబడితో సోలార్‌సెల్, ప్యానెల్ తయారీ పరిశ్రమను నెలకొల్పుతున్నారన్నారు. ఈ పరిశ్రమ నిర్మాణం వల్ల వెయ్యి మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి లభించనుందన్నారు. ఏడాది కాలంలో పరిశ్రమ నిర్మాణం పూర్తవుతుందని, గ్రీన్‌ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన సురభి గ్రూప్స్ చైర్మన్ హరిందర్‌రావును అభినందించారు.

రెండు ప్రచార ఆటోలు సీజ్

తంగళ్లపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ప్రచారం నిర్వహిస్తున్న తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీ గ్రామ సర్పంచ్ అభ్యర్థి గడ్డం రచన మధుకర్‌కు చెందిన రెండు ప్రచార ఆటోలను తహశీల్దార్ జయంత్ కుమార్ సీజ్ చేశారు. సర్పంచ్ అభ్యర్థి గడ్డం రచన మధుకర్‌కు చెందిన రెండు ప్రచార ఆటోలు గ్రామంలో ప్రచారం నిర్వహిస్తు న్నాయని తహశీల్దార్‌కు సమాచారం అందింది. తనిఖీ చేసి ఎలాంటి అనుమతి లేదని గుర్తించి రెండు ప్రచార ఆటోలను సీజ్ చేసి కేసు నమో దు చేయించినట్లు తహశీల్దార్ తెలిపారు. ఎన్నికల నిబంధనలకు విరు ద్ధంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రచారానికి మైకు, ఆటో పర్మిషన్ తహశీల్దార్ కార్యాలయంలో తీసుకోవాలని సూచించారు.

ఉమ్మెత్త కాయలు తిని ఇద్దరు చిన్నారులకు అస్వస్థత

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్‌లో ఉమ్మెత్త కాయలు తిని ఇద్దరు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. తల్లిదండ్రులు ఓరును శ్రీను, స్రవంతి వివరాల ప్రకారం.. వారి కుమారుడు ఆదిత్య, కూతురు మహా గత శనివారం ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో ఆవరణలోని ఉమ్మెత్త చెట్టు కాయల గింజలను తిన్నారు. కొద్దిసేపటికి పిల్లలు ఇద్దరూ కడుపు నొప్పితో అస్వస్థతకు గురయ్యారు. తల్లిదండ్రులు ఇద్దరు చిన్నారులను చికిత్స నిమిత్తం జమ్మికుంటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పిల్లలను పరీక్షించిన వైద్యులు ప్రాణపాయం లేదని స్పష్టం చేశారు.

పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ అందజేత


బాధితుడికి ఫోన్ అందజేస్తున్న జగిత్యాల బస్‌స్టేషన్ మేనేజర్

జగిత్యాల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తూ మొబైల్ పోగుట్టుకున్న బాధితునికి ఆర్టీసీ అధికారులు తిరిగి అందజేశారు. కొడిమ్యాల మండలం పూడురుకు చెందిన ఆకుల వరప్రసాద్ కోరుట్ల పట్టణంలో విద్యుత్ శాఖలో సబ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు.

అయితే విధులకు వెళ్లే క్రమంలో అదివారం ఆర్మూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కాడు. బస్టాండ్‌లో దిగి చూసుకోగా తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్ కనబడ లేదు. దాంతో వెంటనే బస్సులో తన మొబైల్ పడిపోయిందని ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారులు బస్సు డ్రైవర్‌కు సమాచారం అందించగా మొబైల్ ఫోన్‌ను బస్సులో నుంచి తీసుకొని అధికారులకు అప్పగించాడు. సోమవారం జగిత్యాల కొత్త బస్టాండ్‌లో బాధితుడు వరప్ర సాద్‌కు స్టేషన్ మేనేజర్ బిఆర్‌రావు అప్పగించారు. ఈ సందర్భంగా బాధితుడు ఆర్టీసీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపాడు.

భక్తజన సంద్రంగా వేములవాడ

● దర్శనం కోసం భక్తుల పాట్లు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ సోమవారం భక్త జనసంద్రమైంది. ఆలయానికి వివిధప్రాంతాల నుంచి దాదాపు 50వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎల్ఈడీ స్క్రీన్‌లో రాజరాజేశ్వరస్వామిని, భీమేశ్వరాలయంలో భీమేశ్వరుడిని దర్శించుకున్నారు. భీమేశ్వరాలయంలో అభిషేకం, అన్నపూజ తదితర ఆర్జిత సేవలలో పాల్గొన్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఇందుకు మూడుగంటల సమయం పట్టింది. భీమేశ్వరాలయం ఎదురుగా ఉన్న అన్నదానసత్రం పైఅంతస్తులో నిత్య కల్యాణం, సత్యనారాయణవ్రతాలు చేయించుకున్న భక్తులకు కష్టాలు తప్పలేదు. నిత్య కల్యాణానికి అనూహ్యంగా భక్తుల సంఖ్య పెరగడంతో 118 టికెట్లు జారీచేశారు. కేవలం దంపతులను మాత్రమే అనుమతించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో రమాదేవి పర్యవేక్షిస్తూ తగిన ఏర్పాట్లు చేపట్టారు. అయినప్పటికీ భక్తుల ఇక్కట్లు చెప్పనలవి కాలేదు. కల్యాణ కట్ట వద్ద స్నానాలకు ఇబ్బందులు పడ్డారు.

వాహనదారులకు ఇబ్బందులు..

ఆలయానికి వచ్చే వాహనాలను భీమేశ్వరాలయం వైపు అనుమతించలేదు. దీంతోవాహనదారులు ఎటువెళ్లాలో తెలియక ఇబ్బందులు పడ్డారు. పార్కింగ్, అన్నదానసత్రం వద్ద నోఎంట్రీ బోర్డులు పెట్టారు. దీంతో భక్తులవాహనాలు భీమేశ్వరస్వామి ఆలయానికి చేరుకోవడానికి కిలోమీటర్ దూరంలో వాహనాలు నిలిపి కాలినడకన వెళ్లాల్సి వచ్చింది.

బద్దిపోచమ్మ ఆలయంలో..

బద్దిపోచమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. భీమేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భం గా పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో బద్దిపోచమ్మఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

అవినీతి జలగలు

● ప్రభుత్వ కార్యాలయాల్లో అమలు కాని సిటిజన్ చార్ట్
● ఆరేళ్లలో 88 కేసుల్లో 131 మంది లంచగొండి ఉద్యోగులు, సహాయకుల అరెస్టు
● నేడు అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం



లంచగొండి ఉద్యోగుల సమాచారం అందించాలంటూ ఏసీబీ ఆవిష్కరించిన పోస్టర్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు జవాబుదారీగా విధులు నిర్వహించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు అవినీతి కూపంలో మునిగిపోతున్నారు. ఏ ప్రభుత్వ కార్యాలయంకు వెళ్లినా ముడుపులు ముట్టజెప్పనిదే ఏ పని కావడం లేదు. విధి నిర్వహణలో భాగంగా ప్రజల సమస్యలు పరిష్కరిం చడం, పనులను సకాలంలో పూర్తి చేయడం ప్రభుత్వ ఉద్యోగుల విధి. కాని చేయాల్సిన పనులను ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారు. లంచం ఇవ్వని వారి ఫైల్ బీరువాలోనే దుమ్ముపట్టి పోతున్నది. అక్కడి నుంచి ఆ ఫైల్ అంగుళం కూడా ముందుకు కదలడం లేదు.

● మధ్యవర్తులుగా సహాయకులు

కొన్ని కార్యాలయాల్లో ఆ ప్రభుత్వ కార్యాలయాకు అనుబంధంగా పనిచేస్తున్న ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు, వాహనాల డ్రైవర్లు, ప్రైవేట్ సహాయకులు మధ్యదళారులుగా వ్యవహరిస్తూ లంచాలను ప్రజల నుంచి వసూలు చేసి అధికారులకు అందజేస్తున్నారు. ఇలా కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు ప్రైవేట్ ఏజెంట్లు, డ్రైవర్లను ఏర్పాటు చేసుకుని లంచాలను వారి ద్వారానే స్వీకరిస్తూ ఏసీబీకి దొరకకుండా తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఒకపని పూర్తి చేయటానికి ప్రభుత్వం నిర్దిష్టమైన కాలాన్ని నిర్ణయించింది. దీనినే సిటిజన్ చార్ట్ అంటారు. ఏ కార్యాలయంలోనూ సిటిజన్ చార్ట్ బోర్డు కనపడదు. ఒకవేళ ఏమూలో కనపడకుండా ఏర్పాటు చేసిసిన బోర్డులో ఆయా పనులు పూర్తి చేసే కాలపరిమితిని పేర్కోన్నప్పటికీ అది అములకు నోచుకోదు.

● టోల్ ఫ్రీ నంబర్ 1064, క్యూఆర్ కోడ్ స్కాన్‌తో ఫిర్యాదులు

అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సమాచారాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఏసీబీ టోల్‌ఫ్రీ నెంబర్ 1064కు కాల్ చేసి చెప్పవచ్చని, తప్పకుండా చర్యలుంటాయని ఏసీబీ పోలీసు అధికారులు అంటున్నారు. ఏసీబీ వాట్సప్ నంబరు 9440446106, కరీంనగర్ డీఎస్పీ నంబర్ 9154388954, క్యూఆర్ కోడ్‌కు స్కాన్ చేసి తెలంగాణ ఏసీబీ అధికారులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. సమాచారం అందించినవారు పేర్లను గోప్యంగా ఉంచుతామని డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు.

● అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ నేపథ్యం...

చాలాదేశాల్లో అవినీతి పెరిగిపోయిన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి 2003 డిసెంబరు 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం నిర్వహించాలని తీర్మానించింది. ఈ మేరకు ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా డిసెంబరు 9న అవినీతి వ్యతిరేక దినోత్సవంపై సమావేశాలు, ర్యాలీలు, విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహిస్తున్నారు. కరీంనగర్ లో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి 9వతేదీ వరకు అవినీతి వ్యతిరేక దినోత్సవంపై పలు కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు.

● కరీంనగర్ రీజియన్‌లో 2019 నుంచి ఇప్పటి 2025 వరకు లంచాలు తీసుకున్న సంఘటనల్లో ఏసీబీ పోలీసులు 88 కేసులు నమోదు చేసి 131 మంది లంచగొండి ఉద్యోగులు, మధ్యవర్తులను అరెస్టు చేశారు. ఇందులో 35 మంది రెవెన్యూ ఉద్యోగులు, 13మంది పోలీసు ఉండటం గమనార్హం. 2019లో 17 కేసుల్లో 25 మంది ప్రభుత్వ ఉద్యోగులను ఏసీబీ పోలీసులు అరెస్టుచేసి కటకటాల్లోకి పంపించారు. 2020లో ఏడు కేసుల్లో 11మంది, 2021లో 9 కేసుల్లో 15 మంది, 2022లో 13 కేసుల్లో 17 మంది, 2023లో ఎనిమిది కేసుల్లో 11 మంది, 2024లో 11 కేసుల్లో 17 మంది, 2025లో (డిసెంబరు 8 వరకు) 23 కేసుల్లో 35 మంది ప్రభుత్వ ఉద్యోగులు, మధ్య దళారులతో లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు.

నిజాయితీ చాటుకున్న అంబులెన్స్ పైలట్

● వాహనంలో మరిచిపోయిన రూ.10వేలు అప్పగింత



నగదును అప్పగిస్తున్న పంజాల సురేష్

ధర్మపురి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండల కేంద్రానికి చెందిన 102 వాహనం పైలట్ పంజాల సురేష్ మరచిపోయిన రూ.10,000 బ్యాగ్ అప్పగించి సోమవారం నిజాయితీ చాటుకున్నాడు.. ధర్మపురి మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో బుగ్గారం గ్రామానికిచెందిన పొన్నం సుకన్య ఐదు రోజుల క్రితం డెలివరీ అయ్యింది. ధర్మపురి సీహెచ్ నుంచి బుగ్గారం గ్రామానికి చెందిన సుకన్యను 102వాహనంలో ఇంటికి తీసుకు వెళ్లాడు. ఆ సమయంలో పేషంట్‌తో పాటు సామాన్లు దించి పైలట్ సురేష్ ధర్మపురికి చేరుకున్నాడు. వాహనంలోని క్యాబిన్‌లో చూసే సరికి రూ.10వేల నగదు ఉన్న బ్యాగ్ కనిపించడంతో వెంటనే సుకన్య తండ్రి పొన్నం సత్తయ్యకు ఫోన్ చేశాడు. సత్తయ్య ధర్మపురి చేరుకోగా రూ.10వేల నగదుఉన్న బ్యాగ్‌ను ఆయనకు అప్పగించాడు. ఈసందర్భంగా పైలట్ సురేష్‌ను పలువురు అభినందించారు.

ఆర్టీసీ డిపో ఎదుట టిమ్స్ డ్రైవర్ల నిరసన



ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న టిమ్స్ డ్రైవర్లు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పని భారాన్ని పెంచడాన్ని నిరసిస్తూ సోమవారం గోదావరిఖని ఆర్టీసీ డిపో ఎదుట టిమ్స్ సర్వీస్ డ్రైవర్లు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా డ్రైవర్ రంగయ్య మాట్లాడుతూ తమకు ఎలాంటి సమాచారం లేకుండా సోమవారం నుంచి రెండు రోజుల పనివిధానాన్ని ఒక రోజుకు తగ్గించారని అన్నారు. హైదరాబాద్ ఉదయం వెళ్లే టిమ్ డ్రైవర్‌కు రెండు రోజుల వేతనాన్ని ఒకేరోజుకు తగ్గించారన్నారు. దీంతో కండక్టర్, డ్రైవర్ రెండు విధులు ఒకరే నిర్వహించాలంటే ఇబ్బందిగా మారుతుందన్నారు. ఈ సర్వీసులకు కండక్టర్‌ను కూడా ఇస్తే తాము విధులు నిర్వహించడానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. తాము సంస్థకోసం పనిచేస్తామని, సంస్థను కాపాడుకోవడానికి కష్టపడుతామన్నారు. 20ఏళ్లుగా టిమ్స్ డ్రైవర్లుగా పనిచేస్తున్న తమకు స్పెషల్‌ఆఫ్ ఎత్తివేయడంతో తీవ్ర ఆర్థికనష్టం ఏర్పడుతుందన్నారు. రెండు విధులు ఒకరే నిర్వహించాలంటే ఆరోగ్యం సహకరించడం లేదన్నారు. అధికారులు కొత్తగా తీసుకువచ్చిన నిబంధనను రద్దుచేసి పాత పద్ధతిలోనే విధులు కేటాయించాలని డ్రైవర్లు డిమాండ్ చేశారు.

పీజీ మూడో సెమిస్టర్ పరీక్ష వాయిదా వేయాలి



యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

గణేశ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీజీ మూడో సెమిస్టర్ పరీక్షను వాయిదా వేయాలని శాతవాహన యూనివర్సిటీ విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల జరుగుతుంటే వీసీ ఇదే సమయంలో పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులు చాలామంది ఉన్నారని, ఓటు కోసం వెళ్లిరావాలంటే చాలాసమయం పడుతుందని అన్నారు. ఆలోచించకుండా పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. డిసెంబరులోనే సెట్, నెట్ ఎగ్జామ్స్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయని, యూనివర్సిటీలో చాలామంది విద్యార్థులు ప్రిపేర్ అవుతున్నారని అన్నారు. పరీక్షలను తాత్కాలికంగా వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా యూనివర్సిటీలోని లైబ్రరీకి టైమింగ్స్ పెట్టి విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని, ప్రశ్నించిన విద్యార్థులను టార్గెట్ చేస్తున్నారని అన్నారు. వీసీ చొరవ తీసుకొని విద్యార్థుల సమస్య లను పరిష్కరించాలన్నారు.

వైభవంగా అయ్యప్ప ఆరట్టు ఉత్సవం



మానేరువాగులో అయ్యప్పస్వామికి చక్రస్నానం చేయిస్తున్న గురుస్వామి

సిరిసిల్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో అయ్యప్ప ఆరట్టు ఉత్సవాన్ని మాలధారులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో నిర్వహించిన అయ్యప్పస్వామి శోభాయాత్ర కన్నుల పండువగా జరిగింది. అయ్యప్ప ఆలయం నుంచి ప్రారంభమైన శోభయాత్ర మంగళవాయిద్యాలతో అయ్యప్పదీక్షాపరుల నృత్యాలు, శరణుఘోషతో సిరిసిల్ల పట్టణం మారుమోగింది. అనంతరం మాండవ్యనదిలో గురుస్వామి రాచవిద్యాసాగర్ సారథ్యంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేకపూజలు, అర్చనలు, అభిషేకాలతోపాటు చక్రసాన్నం నిర్వహించారు. అనంతరం సాయినగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో మెట్లపూజ నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు భిక్ష అందించారు. కార్యక్రమంలో గురుస్వాములు దుబ్బ విశ్వనాథం, ఎరుకల ప్రకాష్, బల్కి రమేష్ పంతులు, మాజీ కౌన్సిలర్లు కల్లూరి రాజు, వెల్దండి దేవదాస్, అన్నల్‌దాస్ అనిల్‌కుంమార్, కూన సురేష్, మచ్చ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి పనుల పరిశీలన

వేములవాడ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ దేవాలయమైన బద్దిపోచమ్మ ఆలయం రాజగోపురాల నిర్మాణాలకు సోమవారం దేవాదాయశాఖ స్థపతి వల్లి నాయగం, ఎస్ఈ దుర్గాప్రసాద్ మార్కింగ్ చేశారు. అనంతరం ఆలయ రాజగోపుర నిర్మాణాలకు సంబంధించిన మార్కింగ్, నిర్మాణ పద్ధతులు, విస్తీర్ణం, శిల్పకళా ప్రమాణాలను పరిశీలించి కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఆలయ ఈవో రమాదేవి, ఈఈ రాజేష్, డీఈ రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ జోన్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలలో మెడల్స్ సాధించిన బాలికలు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్‌లో సత్తాచాటి వెస్ట్ జోన్ పోటీలకు సిరిసిల్ల పట్టణానికి చెందిన ఇద్దరు బాలికలు ఎంపికయ్యారు. ఈ నెల 6, 7 తేదిలలో రంగారెడ్డి జిల్లా కేంద్రంలో జిల్లా స్పోర్ట్స్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అస్మిత ఉమెన్స్ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు జరగాయి. వెస్ట్ జోన్ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన ప్రవళిక, శ్వేదికలను సోమవారం తెలంగాణ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ కోశాధికారి పన్నీర్ శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి వొడ్నాల శ్రీనివాస్ అభినందనలు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ నుండి ముగ్గురు బాలికలు కిక్ బాక్సింగ్ పోటీలలో పాల్గొన్నారు. జూనియర్ హార్డ్ స్టైల్‌వెపన్ ఈవెంట్ విభాగంలో గంగనావేణి ప్రవళిక గోల్డ్‌మెడల్, సబ్ జూనియర్స్ విభాగంలో గజ్జెల శ్వేదిక సిల్వర్ మెడల్ సాధించింది. గోల్డ్,సిల్వర్ మెడల్స్ సాధించిన ప్రవళిక, శ్వేదిక వెస్ట్‌జోన్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వెస్ట్ జోన్‌స్థాయి పోటీలలో ఎనిమిది రాష్ట్రాలు పోటీలలో పాల్గొంటాయి. ఈనెల 25 నుంచి 28 వరకు మధ్యప్రదేశ్ ఇండోర్‌లో జరగనున్న వెస్ట్‌జోన్ కిక్‌బాక్సింగ్ పోటీల్లో ప్రవళిక, శ్వేదికలు పాల్గొంటారు.

గజ.. గజ..

● చలి నుంచి రక్షణకు ఒక్కచోట ఒదిగిన పిట్టలు

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరుగుతున్న చలితీవ్రతతో చిన్నచిన్న పక్షులు తట్టుకోలేక పోతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం విద్యానగర్‌లో సోమవారం తెల్లవారుజామున కురుస్తున్న మంచుకు పక్షులు తడిసి ముద్దయ్యాయి. చలి దాటికి ఏడు చిన్న పసరిక పిట్ట(దీ గ్రీన్ బీ)లు సూర్యకాంతి కోసం వేచి చూస్తూ విద్యుత్ తీగపై దారంకు గుచ్చిన పూలమాదిరిగా ఒక్కచోట దగ్గరగా కూర్చుని వెచ్చదనం పొందుతున్నాయి. ఈ దృశ్యంను 'ఆంధ్రజ్యోతి' తన కెమరాలో బంధించింది.



విద్యుత్ తీగపై చలిలో పసరిక పిట్టలు

అహల్యానగర్‌లో ఇళ్ల చుట్టూ మురుగు నీరు



ఇళ్ల చుట్టూ ఉన్న మురుగునీరు

హుజూరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అహల్యానగర్-1లో ఇళ్ల చుట్టూ మురుగునీరు నిలుస్తుండడం స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తోంది. కొన్నిరోజులుగా మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కాలనీలో చేపట్టిన మురికి కాలువ నిర్మాణం సగంలోనే వదిలేశారని, ఇళ్లలోని మురుగునీరు రోడ్లమీద నిలుస్తోందని వాపోతున్నారు. దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నామన్నారు. మున్సిపల్ కమిషనర్ స్పందించాలని, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

రూ.7300 పలికిన పత్తి ధర



పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న

జమ్మికుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.7300పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 68మంది రైతులు 546 క్వింటాళ్ల విడిపత్తి విక్రయానికి తీసుకొచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలంద్వారా గరిష్ఠధర రూ.7300, కనిష్ఠధర రూ.6500 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు. పత్తి కొనుగోళ్లను మార్కెట్ కమిటీచైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందం పరిశీలించారు.

ఖని జనరల్ ఆసుపత్రిలో
పని చేయని నిఘా నేత్రాలు

● పెరుగుతున్న చోరీలు
● ఏడాదిగా నిరుపయోగంగా ఉన్నవైనం



ఆసుపత్రిలో నిరుపయోగంగా ఉన్న సీసీ కెమెరాలు

కళ్యాణ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిత్యం రోగులతో కిటకిటలాడే గోదావరిఖని జనరల్ ఆసుపత్రిలో ఏడాదిగా సీసీ కెమెరాలు పనిచేయక ఆసుపత్రికి వచ్చే రోగుల విలువైన వస్తువులు చోరీకి గురవుతున్నాయి. ఆసుపత్రి పాత భవనం చుట్టూ, లోపల 13నిఘా నేత్రాలు ఉండగా అవి పని చేయడం లేదు. ఇటీవల ఆసుపత్రిలో రోగుల వస్తువులు, సెల్‌ఫోన్లు, మోటార్ సైకిళ్లు చోరీకి గురవుతున్నాయి. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు డబ్బులు పోగొట్టుకుని ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఆసుపత్రికి వచ్చే బాధితుల్లో చాలా మంది నిరుపేదలు కావడం, వారు తెచ్చుకున్న వస్తువులు దొంగలు ఎత్తుకెళుతుండడంతో మనోవేదనకు గురవు తున్నారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆసుపత్రిలో 13 కెమెరాలు, మెడికల్ కళాశాలలో 12 కెమెరాలను ఏర్పాటు చేశారు. రెండేళ్ల పాటు పని చేసిన ఈ సీసీ కెమెరాలు ఏడాదిగా పనిచేయడం లేదు. సీసీ కెమెరాల కాంట్రాక్టర్ రెండు సంవత్సరాల అగ్రిమెంట్ పూర్తి కావడంతో వాటిని పట్టిం చుకోవడం లేదు. ఆసుపత్రిలో ఓపీవార్డుల వద్ద కెమెరాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఎక్కడికక్కడ కేబుల్ వైర్లు తెగిపోయాయి.

● ఆసుపత్రిలో విలువైన యంత్రాలు చోరీ...

రోగుల వస్తువులతోపాటు ఆసుపత్రిలోని విలువైన యంత్రాలు చోరీకి గురవుతున్నాయి. ఇటీవల వైద్యులు హాజరు నమోదు చేసుకునే ఫేస్ రికగ్నైజ్ యంత్రాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. దీనిపై ఇప్పటికీ వారిని కనిపెట్టలేకపోయారు. నిత్యం సెక్యూరిటీ కనుసైగల్లో ఉండే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో విలువైన ఫేక్ రికగ్నైజ్ యంత్రాన్ని చోరీ చేయడం పలు అనుమానాలకు దారి తీస్తుండగా పోలీసులు విచారణ చేపట్టినా జాడ తెలియలేదు. చోరీకి గురైన యంత్రానికి సెక్యూరిటీ గార్డులను బాధ్యులను చేస్తూ వారి వేతనాల నుంచి కోత విధించారు. దీనిపై సెక్యూరిటీ గార్డులు కూడా నిరసన తెలిపారు.

● రోగుల వస్తువులు, బైక్‌ల చోరీ

ఆసుపత్రికి వచ్చే రోగుల విలువైన వస్తువులు, బైక్‌లను చోరీచేస్తున్నా వారిని పట్టుకోలేక పోతున్నారు. బెల్లంపల్లికి చెందిన ఓ వ్యక్తి భార్య ప్రసవం కోసం ఆసుపత్రికి రాగా అతడు వరండాలో నిద్రిస్తుండగా జేబులో నుంచి పర్సును ఎత్తుకెళ్లారు. గోదావరిఖనికి చెందిన ఓ వ్యక్తి డబ్బులు చోరీ చేశారు. ఇటీవల రెండు బైక్‌లు కూడా చోరీకి గురికాగా ఆసుపత్రిలో పనిచేసే సెక్యూరిటీ, వైద్య సిబ్బంది పట్టుకున్నారు.

కలెక్టర్‌కు విన్నవించాం...

\- రాజు, ఆర్ఎంవో



ఆసుపత్రిలో ఏడాదిగా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. మెడికల్ కళాశాల నిర్మాణంలో భాగంగా ఆసుపత్రిలో 13, కళాశాలలో 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో 13కెమెరాలు పని చేయడం లేదు. చోరీలపై రోగులు తరచూ ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక ఇచ్చాం. త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం.

బంగారు పతకాలు

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్-2025 పోటీలు ఈ నెల 7న జిల్లా కేంద్రంలోని పొన్నాల గార్డెన్‌లో నిర్వహించగా, మానస స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో విద్యార్థులు తమ ప్రతిభను చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ రజితరావు తెలిపారు. తమ పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి శివాత్మిక్, 7వ తరగతి విద్యార్థి విహాస్‌లు అద్భుత ప్రతిభ ప్రదర్శించి బంగారు పథకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సత్తాచాటాలని ప్రిన్సిపాల్ రజితరావు ఆకాంక్షించారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన జక్కుల వెంకట్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మరణించగా మృతురాలి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సోమవారం పరామర్శించారు. జగిత్యాల పట్టణంలోని 44వ వార్డు నాయకులు కోండేరి దాసు తండ్రి అర్జున్ ప్రమాదవశాత్తు గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ నక్కల రవీందర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి భూపెల్లి శ్రీనివాస్, గోలి శ్రీనివాస్, దాసరి ప్రవీణ్, బోగ అరవింద్ తదితరులు ఉన్నారు.

మహాభారత ప్రవచనం

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలం దరూర్ గ్రామంలో నిర్వహిస్తున్న మహాభారత నవాహ్నిక ప్రవచన జ్ఞాన యజ్ఞము కార్యక్రమం రెండవ రోజైన సోమవారం ఘనంగా కొనసాగింది. మార్గశిర మాసాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణానికి చెందిన జగదాలయ భక్త బృందం ఆధ్వర్యంలో శృంగేరి శారదా పీఠ ఆస్థాన పండితులు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి చే నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో వందలాది మంది మహిళలు, భక్తులు పాల్గొని ప్రవచనాలను విని తరించారు.

కుంగ్‌ఫూలో ప్రతిభ

రాయికల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ డో పోటీల్లో రాయికల్ పట్టణానికి చెందిన గంట్యాల-ప్రవీణ్-లక్ష్మీశ్రీల కుమారుడు గంట్యాల హర్షిత్, హరిణీలు ప్రతిభ కనబరిచారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో వీర కుంగ్‌ఫూ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కుంగ్ ఫూ డో ఛాంపియన్‌షిప్-2025 పోటీల్లో హర్షిత్ బంగారు పతకం సాధించగా, హరిణి వెండి పతకాన్ని సాధించింది. విద్యార్థులను కుంగ్ ఫూ డో మాస్టర్ ప్రభాకర్ అభినందించారు.

సన్మానం

ఇబ్రహీంపట్నం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యామపూర్ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కాంగ్రెస్ నాయకుడు కనుక నగేష్‌ను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి కృష్ణారావు సోమవారం సన్మానించారు. ప్రభుత్వం నుండి యామపూర్ గ్రామానికి అధికంగా నిధులు మంజూరుకు కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి


లక్ష్మీపూర్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

జగిత్యాలరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జగిత్యాల రూరల్ సీఐ సుధాకర్ అన్నారు. ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆయన పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్, జాబితాపూర్ గ్రామాల్లో సోమవారం 50 మంది పోలీసులతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లడుతూ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు తావివ్వకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలు జరిగిన, అనుమానస్పద వ్యక్తులు కనబడిన డయల్ 100కు సమాచారం అందించాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐలు ఉమాసాగర్, గీత, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

●**రాయికల్:** గ్రామ పంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛా వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం రాయికల్ ఎస్సై సుధీర్ రావు ఆధ్వర్యంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

డీఎస్పీ రఘుచందర్ పర్యవేక్షణలో, సీఐ సుధాకర్ సూచనల మేరకు జగిత్యాల రూరల్ ఎస్సై ఉమాసాగర్, సారంగాపూర్ ఎస్సై ఆధ్వర్యంలో 50 మంది పోలీసులు మండలంలోని భూపతిపూర్, రామాజీపేట, అర్పీపూర్ గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, పోలింగ్ కేంద్రాల్లో విస్తృతంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజల్లో భద్రతాభావాన్ని కల్పించారు.

●**మల్లాపూర్:** ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని మెట్‌పల్లి సీఐ అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ముత్యంపేటతో పాటు మల్లాపూర్ గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. ఆయా గ్రామాల్లో జరిపిన పోలీసు ఫ్లాగ్ మార్చ్‌లో మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి ఎస్సైలు రాజు, అనిల్‌కుమార్, కిరణ్‌కుమార్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

●**ధర్మపురి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించు కోవాలని ధర్మపురి ఎస్ఐ జి.మహేష్ కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో వాట్సప్‌లో గాని ఇతర సోషల్ మీడియాలో ఎవరినైన ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేయరాదని ఆయన అన్నారు. రెచ్చగొట్టే మెసేజ్‌లు పంపరాదని, అన్ని వాట్సప్ గ్రూపులు, ఇతర సోషల్ మీడియా ప్లాట్ ఫామ్‌లు పోలీసుల పర్యవేక్షణలో ఉంటాయని ఆయన తెలిపారు. ఎన్నికల్లో అల్లర్లకు పాల్పడరాదని, శాంతి భద్రతలు విఘాతం కలిగించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు పతకాలు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ఇబ్రహీంపట్నంకు చెందిన పలువురు తమ ప్రతిభను చూపి పలు పతకాలు సాధించారు. ఆదివారం జగిత్యాల జిల్లాలో పవన్ కరాటే అకాడమి ఆర్గనైజర్ పవన్ ఆధ్వర్యంలో 2వ రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిం చారు. ఇందులో జేకేఏ ఇండియా షోటోకాన్ కరాటే అసోసియేషన్ జగిత్యాల జిల్లా తరపున 53 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కాగా ఇబ్రహీంపట్నంకు చెందిన ఐదుగురు విద్యార్థులు సాయితేజ, రిశ్వంత్, నిహాల్, ప్రేమ్‌లు కటాస్ విభాగంలో పసిడి, కృతిక వెండి, వర్ధిని కాంస్య పతకాలు సాధించారు. అలాగే అత్యధిక బంగారు పతకాలు సాదంచిన ప్రవీణ్ కుమార్ మాస్టర్ కరాటే అసోసియేషన్ ఓవరాల్ చాంపియన్‌షిప్ కప్ కైవసం చేసుకున్నారు. అనంతరం టోర్నమెంట్ ప్రధాన జడ్జి రచ్చ శ్రీనివఆస్, ఆర్గనైజర్ పవన్, జిల్లా ప్రధాన కరాటే శిక్షకులు ప్రవీణ్ కుమార్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలను అందజేశారు. కాగా పలు జిల్లాల నుండి సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారని మాస్టర్ శిక్షకులు ప్రవీణ్ కుమార్ తెలిపారు. అలాగే ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కరాటే మాస్టర్లు నవీన్, వంశీనాయుడు, విశ్వతేజ, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప ఆరట్టు మహోత్సవం


పూజలు చేస్తున్న అయ్యప్పస్వాములు

మెట్‌పల్లి టౌన్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో అయ్యప్పస్వామి ఆరాట్టు పూజా మహోత్సవం ఘనంగా అయ్యప్పస్వాములు, పట్టణ ప్రజలు సోమవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు భక్తులతో కలిసి పాలొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ చెన్నకేశవ స్వామి ఆలయం ముందుగల కోనేటిలో పంచామృభిషేకాలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి చక్రస్థాన మహోత్సవం నిర్వహించారు. అయ్యప్ప ఆలయ శాశ్వత అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌లు అయ్యప్పస్వామి ఆలయం నుండి చెన్నకేశవ ఆలయం వరకు స్వామి వారి ఊరేగింపులో పాల్గొన్నారు. ఒక్కసారిగా పట్టణమంతా పండుగ వాతావరణం కనిపించడంతో పలువురు భక్తులు, స్వాములు తన్మయత్వంతో ముగ్ధులయ్యారు.

ఈ వేడుకల్లో అయ్యప్ప గురుస్వాములు మంత్రి అంజయ్య, గంగుల వివేక్, ఆలయ కమిటీ అధ్యక్షుడు దొమ్మేటి ప్రవీణ్, ఉపాధ్యక్షులు అంకత్ భరత్, చేపూరి రాము, ఉజగిరి శ్రీనివాస్, శీలమంతుల శివ, టీఎంపీ చైర్మన్ కూన గోవర్ధన్, సింగిల్ విండో చైర్మన్ కోమిరెడ్డి తిరుపతిరెడ్డి, మనదీప్, లక్ష్మణ్, జెట్టి లింగం, బాసెట్టి హరీష్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే మనుగడ

జగిత్యాల అగ్రికల్చర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుల సంఘాల ఐక్యతతోనే మనుగడ సాధ్యం అవుతుందని భారత జాతీయ మాలల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాయితి శంకర్, జిల్లా అధ్యక్షుడు మ్యాదరి శ్రీహరి అన్నారు. సంఘ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారత జాతీయ మాలల క్రైస్తవ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా ముద్దమల్ల ఆనంద్‌ప్రవీణ్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సాల్మన్, సురేందర్, ప్రసన్న కుమార్‌బాబు తదితరులున్నారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ

ధర్మపురి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తుమ్మెనాలకు చెందిన మామిడిపెల్లి గణేష్ ఓపెన్ కిక్ బాక్సింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 6,7 వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో ఆయన గోల్డ్ మెడల్ సాధించాడు. సీనియర్ పాయింట్ ఫైట్ 50 కేజీల విభాగంలో గణేష్ ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్ సాధించాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 4 నుండి 8 వరకు న్యూ ఢిల్లీలో జరిగే ఓపెన్ ఇంటర్ నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీలకు గణేష్ ఎంపిక అయ్యాడు. గణేష్‌ను కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు, పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ

కోరుట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కేరళా ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి అబ్దుల్ ముజిల్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో రాణించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎంఏ బారీ సోమవారం తెలిపారు.

జగిత్యాల జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో అబ్దుల్ మాజిల్ స్పారింగ్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పథకం సాదించినట్లు బారీ తెలిపారు. బంగారు పథకం సాదించిన మజిల్‌ను పాఠశాల కరస్పాండెంట్ బారీ, ప్రిన్సిపల్ సెలీనా బారీ, చైర్మెన్ హాదిలతో పాటు ఉపాధ్యాయులు అభినందించి సన్మానించారు.

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి


నూతన పాలకవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

రాయికల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం అనునిత్యం కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఏకగ్రీవంగా ఎన్నికైన వీరాపూర్ గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని సోమవారం ఎమ్మెల్యే అభినందించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వీరాపూర్ గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన దిండిగాల రామస్వామి, ఉప సర్పంచ్ నర్సారెడ్డి, వార్డు సభ్యులను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, ఇంతియాజ్, చెట్‌పెల్లి సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

●జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని ధర్మారం గ్రామ 6వవార్డు మెంబరుగా బెడద శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా శంకర్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కలువగా ఆయన అభినందించారు.

'వీరాపూర్ గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తా'


వీరాపూర్ పాలకవర్గ సభ్యులను అభినందిస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

రాయికల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వీరాపూర్ గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తానని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. ఏకగ్రీవమైన మండలంలోని వీరాపూర్ గ్రామ పాలకవర్గం సోమవారం జగిత్యాలలో మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో సర్పంచ్ దిండిగాల గంగు రామస్వామి గౌడ్, ఉప సర్పంచ్ దుంపల నర్సిరెడ్డి, వార్డు మెంబర్లు లావణ్య, తొట్ల రెడ్డి, అంజన్న, నరేష్, మురళి, మమత, అమీర్‌బీలను సన్మానించారు.

నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు

●చర్యలు తీసుకోవాలంటున్న పట్టణ ప్రజలు


ఆర్ఎన్‌టి నగర్‌లో విద్యుత్ పోల్‌ను అనుకొని నిర్మిస్తున్న భవనం

జగిత్యాల టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనల ప్రకారం ఏదైనా ప్రమాదం జరిగినపుడు అగ్నిమాపక యంత్రం, అంబులెన్స్ రాకపోకలకు అనుగుణంగా సరైన పార్కింగ్ స్థలాలను వదిలి భవన నిర్మాణాలు చేపట్టాలి. పట్టణంలో భవన నిర్మాణం చేయాలంటే రోడ్డు కచ్చితంగా 30 ఫీట్లు ఉండాల్సిందే. దానికి తోడు ఐదు ఫీట్లు సెట్‌బ్యాక్ తీసుకుని, పారింగ్ స్థలం, ఇంకుడు గుంత ఏర్పాటు చేసి భవన నిర్మాణాలు చేపట్టాలి. కాని పట్టణంలోని సంతోష్ నగర్‌లో సరైన సెట్‌బ్యాక్ లేకుండానే బహుళ అంతస్తుల భవనం నిర్మాణం జరుగుతోంది. రవీంద్రనాథ్ ఠాగూర్ కాలనీలో సరైన సెట్‌బ్యాక్ లేకుండా విద్యుత్ పోల్‌ను ఆనుకొని రోడ్డుపైనే నిర్మాణాలు చేపడుతున్నారు. విద్యానగర్, కృష్ణనగర్ ఉమాశంకర్ గార్డెన్ సమీపంలో, భవాని నగర్ పట్టణ శివారు ప్రాంతాల్లో ఇష్టానుసారంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. అయితే సామాన్యుల ఇళ్లపైకి బుల్డోజర్లు తీసుకెళ్లే మున్సిపల్ అధికారులకు ఇవి కనబడడం లేదా అని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

జగిత్యాలలో ఇటీవల జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ సెట్ బ్యాక్ లేకుండా జరిగే నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్లాట్ యజమానులు, భవన నిర్మాణదారులు నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై టిపిఓ శ్రీనివాస్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భక్తి మార్గంలో నడవాలి


కోరుట్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రహ్లాదుడు చెప్పే సత్యం భక్తి మార్గంలో నడిపిస్తుందని బ్రహ్మ శ్రీ గర్రెపల్లి మహేశ్వర శర్మ అన్నారు. సోమవారం పట్టణంలోని వాసవి కళ్యాణ భవనంలో సనాతన దర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అష్టాదశ పురణ ప్రవచనాల పరంపరలో భాగంగా శృంగేరి ఆస్థాన పురోహితుడు బ్రహ్మశ్రీ మహేశ్వర శర్మ శ్రీ విష్ణు మహాపురాణ ప్రవచన కార్యక్రమాలలో భక్తులకు భక్త ప్రహ్లాద చరిత్ర, శ్రీ నరసింహ స్వామి ఆవిర్భావం గురించి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమలో సనాతన దర్మ ప్రచార సమితి సభ్యులు మంచాల జన్, బట్టు హరికృష్ణ, రేగుంట రాజారం, పడిగెల శ్రీనివాస్, మోటూరి రాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలోనే అభివృద్ధి చెందాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని పెద్దాపూర్, కొండ్రికర్ల గ్రామాల్లో జరుగుతున్న సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు పలికి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధిలో కేసీఆర్ పాత్ర ఎంతో కీలకమైందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమం చేరేలా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.

●**ఇబ్రహీంపట్నం:** మండలంలోని బర్దీపూర్ గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి తరఫున ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు.



విజయానికి వ్యూహాలు

(ఐదో పేజీ తరువాయి)

మండలాల్లోని పంచాయతీల్లో తాము మద్దతు పలుకుతున్న అభ్యర్థుల విజయానికి కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ప్రచారం ముమ్మరం చేశారు. మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో పార్టీ తరఫున ఒక్కరే బరిలో ఉండేలా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దిశా నిర్దేశం చేస్తున్నారు.

●**క్షేత్ర స్థాయిలో బలం కోసం బీజేపీ..**

క్షేత్ర స్థాయిలో తమ బలాన్ని పెంచుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. స్థానికంగా పట్టు ఉన్న యువతను సర్పంచ్ అభ్యర్థులుగా పోటీలో నిలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మెరుగైన ఓట్లు సాధించిన కోరుట్ల, జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గాల్లో పంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకునేందుకు సమాలోచనలు చేస్తున్నారు. రిజర్వేషన్లకు అనుగుణంగా గ్రామాల్లో పట్టున్న నాయకులు, కార్యకర్తలను సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్లు వేయించి ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ పార్టీ నుంచి ఒక్కరే పోటీలో ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. జిల్లాలోని మెజార్టీ పంచాయతీల్లో విజయం సాధించేలా స్థానిక నాయకులు కసరత్తు చేస్తున్నారు.

ఊపందుకున్న ప్రచారం

కోరుట్ల రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో తొలి విడత ఎన్నికలు జరగనుండగా ప్రచారం ఊపందుకుంది. వివిధ పార్టీల అగ్రనేతలు వారి మద్దతుదారుల తరఫున ప్రచారం నిర్వహిస్తూ గెలిస్తే చేపట్టే పనులను వివరిస్తున్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయితీలు ఉండంగా 57 మంది సర్పంచ్ పదవుల కోసం పోటీపడుతున్నారు. 152 వార్డు ఉండగా 32 ఏకగ్రీవం కాగా 120 వార్డులలో 293 మంది పోటీ పడుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీ అయిలాపూర్‌లో సర్పంచ్ పదవికి 8 మంది పోటీపడగా మూడు పార్టీలకు చెందిన అభ్యర్థుల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. అధికార పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, బీజేపీ నాయకులు నవీన్ కుమార్‌లు తమ అనుచరులతో వారి మద్దతుదారుల తరఫున ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. కాగా ఎవరి అదృష్టం ఎలా ఉందో ఈనెల 11వ తేదీన తేలనుంది.

రెండో విడతకు ఎన్నికల సామగ్రి సిద్ధం


ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల సామగ్రి సిద్ధం చేస్తున్న సిబ్బంది

జగిత్యాలరూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) :జగిత్యాల రూరల్ మండలంలోని రెండవ విడత నిర్వహించే అన్ని గ్రామాల్లో పోలింగ్‌కు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈనెల 14న జగిత్యాల రూరల్ మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో ఎన్నికలు జరగనుండగా జగిత్యాల రూరల్ మండల ప్రజాపరిషత్ కార్యాలయానికి ఎన్నికల సామగ్రి చేరింది. ఈమేరకు ఎంపీడీఓ రమాదేవి ఆధ్వర్యంలో ఎంపీఓ రవిబాబు, పర్యవేక్షకులు చౌడారపు గంగాధర్, సిబ్బంది ఆయా గ్రామాల వారీగా వేరు చేసి బ్యాలెట్ బాక్సులతో పాటుగా ఎన్నికల సామగ్రిని సిద్ధం చేస్తున్నారు.

పండగలకు ఉచిత డీజే

-ఆడపిల్ల పుడితే రూ.5వేలు.. పెళ్లి కానుక రూ.5వేలు

-సర్పంచ్ అభ్యర్థుల హామీల మేనిఫెస్టో

మల్యాల, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సర్పంచ్ అభ్యర్థులు ఓటర్లకు హామీల వర్షం కురిపిస్తున్నారు. మల్యాల మండలం ఓబులాపూర్‌లో సర్పంచ్ అభ్యర్థులు తమను గెలిపిస్తే ఐదు సంవత్సరాలలో చేపట్టే పనులను మేనిఫెస్టో రూపకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు. ఓ సర్పంచ్ అభ్యర్థి తనను గెలిపిస్తే సర్పంచ్ జీతం నుంచి మొదటి కాన్పులో ఆడబిడ్డ పుడితే రూ.5వేల ఫిక్సడ్ డిపాజిట్ చేయిస్తానని హామీ ఇస్తున్నాడు. మరో అభ్యర్థి ప్రతి ఆడబిడ్డ పెండ్లి కానుకగా రూ.5వేల కట్నం ఇస్తానని ప్రచారం చేస్తున్నాడు. గెలిచిన ఆరు నెలల్లో ఉచితంగా అంబులెన్స్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చాడు. యువకులకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఎక్కడ క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొన్న ముందుండి ప్రోత్సహిస్తానని ప్రచారం చేస్తున్నాడు. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ మాదిరిగా తమ గ్రామాన్ని ఫ్యూచర్ విలేజిగా మారుస్తానని ప్రచారంలో పేర్కొంటున్నారు. డిజిటల్ లైబ్రరీ, బాడీ ఫ్రీజర్, వైకుంఠ రథం సమకూర్చుతానని, యువకులకు స్కిల్ డెవలప్‌మెంట్, ఓపెన్ జిమ్, పండగలకు ఉచిత డీజే సౌకర్యం కల్పిస్తానని, మహిళలకు కుట్టుశిక్షణ తదితర ఉపాధి అవకాశాలు అందిస్తానని మరో అభ్యర్థి మేనిఫెస్టోలో పేర్కొన్నాడు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

-అదనపు కలెక్టర్ రాజాగౌడ్


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాల అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో విధులు సమర్థవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ ఎన్నికల సిబ్బందికి సూచించారు. సోమవారం సారంగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియలో పిఓలు క్రియాశీలకంగా వ్యవహరించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నిబంధనలను పక్కగా పాటిస్తూ పోలింగ్ నిర్వహించాలని

సకాలంలో నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకోవాలని సూచించారు. చెక్ లిస్ట్‌కు అనుగునంగా బ్యాలెట్ పత్రాలు, లితర సామాగ్రిని క్షుణ్ణంగా పరిశీలించుకోవాలన్నారు. సీక్రెట్ ఓటింగ్ కంపార్ట్‌మెంట్ వంటి నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాలెట్ పేపర్ బయటకు పోకుండా చూడాలని ఆయన ఆదేశించారు. పోలింగ్ కౌటింగ్ ప్రక్రియలు సాఫిగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి రవి కుమార్, ఎంపీడీవో సలీం తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి'

ఇబ్రహీంపట్నం, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ ప్రతిపాదించిన అభ్యర్థులను గెలిపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. సోమవారం ఆయన మండలంలోని తిమ్మాపూర్ తండాలో సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ ఏలేటి వెంకటరెడ్డి, యామపూర్ నూతన సర్పంచ్ కనుక నగేష్ పాల్గొన్నారు.